# మృతుల కుటుంబాలకు రాజేష్ కన్నా ఆర్థిక సహాయం

**- రాజకీయాలకు అతీతంగా బాధిత కుటుంబాలకు చేయూత**

**- కృతజ్ఞతలు తెలుపుతున్న మండల ప్రజలు**



వర్ధన్నపేట, జులై 10,(జర్నలిస్ట్ వార్త): వర్ధన్నపేట మండలం కొత్తపల్లి గ్రామానికి చెందిన బీసుపాక కొమురమ్మ (75) అనే వృద్ధురాలు అనారోగ్యంతో మృతి చెందారు. సమాచారం తెలుసుకున్న వర్ధన్నపేట పిఏసిఎస్ చైర్మన్ కౌడగాని రాజేష్ ఖన్నా సంఘటన స్థలానికి చేరుకుని మృతురాలి పార్థివ దేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం వారి కుటుంబ సభ్యులకు 4 వేల రూపాయల ఆర్థిక సహాయం అందించారు. ఇలా వర్ధన్నపేట మండల పరిధిలోని పలు గ్రామాలలో మృతి చెందిన బాధిత కుటుంబాలను సందర్శించి రాజకీయాలకు అతీతంగా రాజేష్ ఖన్నా ఆర్థిక సహాయం అందజేస్తూ చేయూతనిస్తున్నారు. గత కొన్ని సంవత్సరాల నుంచి ఆయన చేస్తున్న ఆర్థిక సహాయానికి మండల పరిధిలోని ప్రజలు కృతజ్ఞతలు తెలుపుతున్నారు. వారి వెంట మాజీ ఉప సర్పంచ్ జన్ను రాములు, కారోబార్ బాబు, జోసెఫ్, రవి, ఇస్తారీ, తదితరులు పాల్గొన్నారు.

# భద్రకాళీ దేవస్థానంలో శాకంభరీ నవరాత్రి ఉత్సవాలు



వరంగల్, జులై 10,(జర్నలిస్ట్ వార్త): వరంగల్ మహానగరంలోని చరిత్ర ప్రసద్ధిగాంచిన శ్రీ భద్రకాళీ దేవస్థానంలో శాకంభరీ నవరాత్రి ఉత్సవాలు 5వ, రోజుకు చేరుకున్నాయి. బుధవారంనిత్యాహ్నికం, క్షీరాన్న నివేదన నీరాజన మంత్ర పుష్పములతో ముగిసింది. ఆలయ ప్రధానార్చకులు శ్రీ భద్రకాళి శేషు శాకంభరీ ఉత్సవ నిర్వహణలో భాగంగా ద్వయం కావడం వల్ల అమ్మవారి దశ మహావిద్యలలోని కాళీ క్రమాన్ని అనుసరించి షోడశీక్రమాన్ని అనుసరించి ఉదయం కురుకుల్లాగా సాయంకాలం భేరుండాగాను అమ్మవారిని అలంకరించి నవరాత్ర విశేష పూజలు నిర్వహించారు. కురుకుల్లా మాత కాటుకలాంటి నల్లని చీకటి వర్ణముతో నుండి సముద్రమునందు మణిమయమైన నౌకాయానము అతిశీఘ్రముగా జరుపుచూ ప్రారబ్ధవశమున సంసార సాగరము నందు కొట్టుమిట్టాడుతున్న జీవులను తన నౌకయందు ఎక్కించుకొని దరిచేర్చును. భేరుండా మాత భక్తుల పాపములను శమింపజేయునని ఆలయ ప్రధానార్చకులు బ్రహ్మశ్రీ భద్రకాళి శేషు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ కార్య నిర్వహణ అధికారి శేషుభారతి, అర్చక సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# మున్సిపాలిటీ ముందే ముప్పు.. తప్పించరూ...!

**- రోడ్డును పగల గొట్టగా ఏర్పడిన గుంత**

**- తారు, మొరం పోయగా ఫలితం లేదు**

**- గుంత లోతుగా మారడంతో వాహన దారులకు తప్పని తిప్పలు**



నర్సంపేట, జులై 10,(జర్నలిస్టు వార్త): నర్సంపేట పట్టణ కేంద్రంలో ఓ గుంత ప్రయాణికులకు, వాహనదారులను ప్రమాదంగా మారింది. నిరంతరం వాహన దారులకు తప్పని తిప్పలుగా మారింది. పైప్ లైన్ కోసం తీసిన ఆ గుంత మూలంగా ప్రధాన రహదారిపై ప్రయాణించే వాహనదారులు పడుతూ లేస్తున్నారు. తాత్కాలిక ఉపశమనం కోసం మొరం పోసిన వాహనాల రాకపోకలు ఎక్కువగా ఉండటంతో ప్రధాన రహదారి కావడం వల్ల ఫలితం లేక పోయింది. స్వయంగా ఆ గుంత మున్సిపల్ కార్యాలయం ఎదురుగా ఉండటం విశేషం. వాహనదారులు ఇబ్బందులు పడడం గ్రహించిన స్థానికులు అధికారులు పట్టించుకాకపోవడం వల్లే వాహనదారులు, ప్రయాణికులు ఇలాంటి పరిస్థితులు ఎదుర్కొంటున్నారని ఆరోపిస్తున్నారు. ఆ గుంత మూలంగా వాహన దారులకు తృటిలో ప్రమాదం తప్పిందని చెప్పవచ్చు. బుధవారం సెంట్రింగ్ కర్రల లోడ్ తో వెళుతున్న ఓ ఆటో గుంతలో దిగబడింది. ఎంత ప్రయత్నించినా బయట పడకపోవడంతో హమాలీలు వచ్చి ఆటోను నెట్టి బయటకు తీశారు. ఇలా చేస్తున్న క్రమంలో ట్రాఫిక్ జామ్ కావడంతో పాటు వాహన దారులు ఇబ్బందులు పడ్డారు. మున్సిపాలిటీ అధికారులు, సంబంధిత అధికారులతో కలిసి గుంతకు శాశ్వత మరమత్తు పనులు చేపట్టి, వాహనదారులకు ఉపశమనం కలిపించాలని, ప్రయాణికులు, స్థానికులు కోరుతున్నారు.

# కొత్త రేషన్ కార్డులు ప్రభుత్వం వెంటనే మంజూరు చేయాలి

**- బిజెపి నాయకుడు నూకల కృష్ణయాదవ్**



**చెన్నారావుపేట, జూలై 10,(జర్నలిస్ట్ వార్త):** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు రేషన్ కార్డులు వెంటనే మంజూరు చేయాలని బిజెపి నాయకుడు నూకల కృష్ణయాదవ్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలో జరిగిన సమావేశంలో అయన మాట్లాడుతూ గడిచిన పదేళ్లలో టిఆర్ఎస్ ప్రభుత్వం ఒక రేషన్ కార్డు ఇవ్వలేదన్నారు. ఆ పార్టీని ప్రజలు చిత్తుచిత్తుగా ఓడించిన సంగతి తెలిసిందే అన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడు నెలలు గడుస్తున్నా, రేషన్ కార్డుల ఊసెత్తక పోవడంతో అర్హులైన వాళ్లు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ప్రభుత్వం అమలు చేస్తున్న గ్యారంటీ పథకాలు, రేషన్ కార్డు ఉన్నవారికే ఇస్తామని చెప్పడంతో కార్డులు లేని వాళ్లు ఆ పథకాలు అందకుండా పోతాయని ప్రజలు నిరాశకు గురవుతున్నట్లు తెలిపారు. గత డిసెంబరు 28వ, తేదీ నుంచి జనవరి 6వ, తేదీ వరకు నిర్వహించిన ప్రజాపాలన సభల్లో గృహజ్యోతి, మహాలక్ష్మి, రైతు భరోసా, ఇందిరమ్మ ఇళ్లు, చేయూత పథకాల ద్వారా లబ్ధి పొందేందుకు ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. ఈ పథకాలన్నింటినీ రేషన్ కార్డులు కలిగి ఉన్న వారికే అమలు చేస్తామని ప్రభుత్వం పేర్కొంది. రేషన్ కార్డులు లేని వాళ్లు గ్యారంటీ పథకాల కోసం దరఖాస్తు చేసుకోవడంతో పాటు రేషన్ కార్డు కోసం కూడా గ్రామసభల్లో దరఖాస్తులు చేసుకున్నారు. అయినప్పటికీ ఇప్పటి వరకు రేషన్ కార్డు ప్రక్రియ మొదలుకాలేదని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రావడంతోనే అర్హులైన వారికి రేషన్ కార్డులు మంజూరు చేస్తామని హామీ ఇచ్చి, ఇప్పటి వరకు వాటి గురించి ఏ నిర్ణయం తీసుకోవడం లేదన్నారు. ఉచిత వైద్య సదుపాయాన్ని కార్డులు లేక, అర్హత ఉండి వినియోగించుకోలేక చాలా మంది ప్రైవేట్ హాస్పిటల్ కి పోయి అప్పుల పాలు కావాల్సి వస్తుందని వ్యాఖ్యానించారు. ఉచిత విద్యుత్ సౌకర్యం, ఇందిరమ్మ ఇళ్లు, ఆరోగ్యశ్రీ సేవలను కోల్పోయే ప్రమాదం ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు .ప్రజా ప్రభుత్వమని చెప్పుకునే ఈ ప్రభుత్వం పేదల పక్షాన నిలిచి, అర్హులైన పేదలందరికీ రేషన్ కార్డులు త్వరగా మంజూరు చేయాలని వారు డిమాండ్ చేశారు.

# మూడు రోజుల్లో నేరస్తులను పట్టుకున్న పోలీసులు

- దొంగతనానికి వెళ్లి హత్య చేసిన నలుగురు యువకుల అరెస్ట్
- ఒంటరిగా ఉన్న సమయంలో మాస్టర్ ప్లాన్
- తలుపు తీయగానే పిడి గుద్దులతో దాడి
- మద్యం బాటిళ్లు, సిగరెట్లు, వెయ్యి రూపాయలు దొంగతనం
- మరణించాడని తెలిసి బావిలో పడేసిన వైనం
- బయటకు రాకుండా బురద జల్లి పరారు




నర్సంపేట, జూలై 10, జర్నలిస్టు వార్త:

తాగుడుకు బానిసైన ఓ యువకుడు తన స్నేహితులతో కలిసి బెల్ట్ షేపులో మద్యం దొంగతనం చేయడమే కాకుండా బెల్ట్ షాప్ ఓనర్ ను సైతం హత్య చేసిన సంఘటన నర్సంపేట పట్టణ కేంద్రంలోని ఇందిరమ్మ కాలనిలో చోటు చేసుకుంది. బుధవారం మృతుని కుమారుడు పోలీస్ స్టేషన్లో ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. జరిగిన సంఘటనపై అప్రమత్తమైన పోలీసులు హత్య జరిగిన మూడు రోజుల్లోనే నిందితులను పట్టుకున్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో సీఐ రమణమూర్తి తెలిపిన వివరాల ప్రకారం షేక్ రహీమ్ అనే వ్యక్తి పట్టణ కేంద్రంలోని ఇందిరమ్మ కాలనిలో బెల్ట్ షాప్ నడుపుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఆదివారం నాడు ఇంట్లో ఒంటరిగా రహీమ్ ఉన్న విషయాన్ని అదే కాలనిలో నివాసం ఉండే దారంగుల ప్రవీణ్, బొంత రాజు, తాడెం పవన్, తాడం శివ గమనించి అర్ధరాత్రి సమయంలో రహీమ్ ఇంటి తలుపు తట్టగా, తెలిసిన వారేనని రహీమ్ తలుపు తీయగానే రహీమ్ పై పిడి గుద్దులతో దాడి చేసి, గొంతు నులిమి హత్య చేశారు. సాక్షాలు దొరకకుండా మృత దేహాన్ని బావిలో పడేసి, మృతుని ఇంట్లో ఉన్న మద్యం బాటిళ్లు, సిగరెట్ ప్యాకెట్లు, వెయ్యి రూపాయల నగదును దొంగిలించినట్లు తెలిపారు. హత్య నేరం బయటికి రాకుండా ఉండటానికి బురద జల్లి సంఘటన స్థలం నుంచి పారిపోయినట్లు వివరించారు. అనుమానాస్పద స్థితిలో బావిలో మృత దేహం దొరకటంతో మృతుని కొడుకు రహీమ్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. సంఘటన స్థలాన్ని పరిశీలించి బావిలో ఉన్న మృతదేహాన్ని పోలీసులు వెలికి తీశారు. అనంతరం పోస్టుమార్టం నిర్వహించి మృతికి గల కారణాలు వెలికి తీశారు. హత్యగా భావించిన పోలీసులు విచారణ చేపట్టి, అదే కాలానికి చెందిన నలుగురు యువకులు ఈ హత్య చేసినట్లుగా నిర్ధారించారు. పరారీలో ఉన్న హంతకులను పట్టుకుని, విచారణ చేపట్టి హత్యకు సంబంధిత వివరాలు, అందుకు కారణమైన ఆధారాలు సేకరించారు. ఏ1 ధారంగుల ప్రవీణ్, ఏ2 బొంత రాజు, ఏ3 తాడేం పవన్, ఏ4 తాడేం శివ కుమార్ లను రిమాండ్ కు తరలించారు. పరారీ లో ఉన్న నిందితులను ఖానాపూర్ మండల శివారులో ఉన్న పాత బ్రిడ్జి వద్ద పట్టుకున్నట్లు తెలిపారు. ఈ కేసును సీపీ అంబర్ కిశోర్ ఝా, డిసిపి రవీందర్, ఏసిపి కిరణ్ కుమార్ ఆదేశాల మేరకు విచారణ చేశామని సీఐ రమణమూర్తి తెలిపారు. త్వరితగతిన హత్య కేసును చేదించినందుకు ఉన్నతాధికారులు వారిని అభినందించారు. అభినందనలు పొందిన వారిలో సీఐ రమణమూర్తి, ఎస్సై ప్రవీణ్ కుమార్, సిబ్బంది రహూఫ్, రవి, తానీషా, నాగరాజు, రాజు తదితరులు ఉన్నారు.

# ఇన్చార్జ్ ఎంపీడీవోకి వినతి అందజేత

**- ఎంసిపిఐయు మండల కార్యదర్శి జన్ను రమేష్**



**చెన్నారావుపేట, జులై 10,(జర్నలిస్ట్ వార్త):** చెన్నారావుపేట మండల ఇంచార్జ్ ఎంపీడీవో దయాకర్ కి ఎంసిపిఐయు ఆధ్వర్యంలో బుధవారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎంసిపిఐయూ మండల కార్యదర్శి జన్ను రమేష్ మాట్లాడుతూ వర్షాకాలం ప్రారంభమైంది. మండల పరిధిలోని వివిధ గ్రామాలలో పారిశుధ్యం పేరుకుపోయింది. సరైన డ్రైనేజీలు లేకపోవడంతో మురుగు నీటి నిలువలు, దుర్వాసనలతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. అందువల్ల ప్రజలకు విష జ్వరాలు, మలేరియా, డెంగ్యూ లాంటి వ్యాధులతో బాధపడుతున్నారని అన్నారు.మరి కొన్ని గ్రామాల్లో వీధిలైట్లు, సరైన రోడ్ల సౌకర్యం లేక ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని చెప్పారు. ఇప్పటికైనా గ్రామీణ ప్రాంతాల ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై దృష్టి పెట్టి, గ్రామాలలో బ్లీచింగ్ పౌడర్, దోమల మందు పిచికారి చేయించాలని అన్నారు. ప్రజలకు ఎలాంటి వ్యాధులు సంభవించకుండా జాగ్రత్త చర్యలు చేపట్టాలని అన్నారు. పరిశుభ్రత, పరిరక్షణ లాంటి కార్యక్రమాలు నిర్వహించి, ప్రజలకు అవగాహన కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో రాజు, సాంబయ్య, అచ్చా నాయక్ తదితరులు పాల్గొన్నారు.

# ఎమ్మెల్యేను ఆహ్వానించిన దేవస్థానం ధర్మకర్తలు



రాయపర్తి, జులై 10,(జర్నలిస్ట్ వార్త): రాయపర్తి మండలం సన్నూరు గ్రామం శ్రీ వెంకటేశ్వర స్వామి వారి ఆలయం ధర్మకర్తలు పాలకుర్తి ఎమ్మెల్యే యశస్విని రెడ్డిని దేవాలయానికి ఆహ్వానించారు. బుధవారం ఆలయంలో శ్రీ రంగాచార్య విగ్రహావిష్కరణ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యేతో పాటు శ్రీశ్రీశ్రీ త్రిదండి చిన్న జీయర్ స్వామివారు హాజరైనారు. ఈ సందర్భంగా శ్రీ చిన్న జీయర్ స్వామి చేతుల మీదుగా శ్రీ రంగాచార్య విగ్రహావిష్కరణ చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో పాలకుర్తి కాంగ్రెస్ నియోజక వర్గ ఇంచార్జి ఝాన్సి రాజేందర్ రెడ్డి, ఆలయ ధర్మకర్తల, ప్రధాన అర్చకులు, తదితరులు పాల్గొన్నారు.

